నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

ఉపాధి కోసం వలస వచ్చి నిజాంసాగర్ కాలువలో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-నిజామాబాద్

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నిజాంసాగర్ డీ46 కాలువలో పడి యువకుడు మృతిచెందిన ఘటన ఎడపల్లి మండలం ఏఆర్‌పి క్యాంప్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. నాందేడ్ జిల్లాకు చెందిన వినోద్ (30), అయన భార్య సోన్ కాంబ్లే మనిషా కలిసి జీవనోపాధి కోసం ఎడపల్లి మండలంలోని ఏఆర్ పి క్యాంప్ గ్రామానికి గత మూడు రోజుల క్రితం వచ్చారు. ఆదివారం ఉదయం వినోద్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి నిజాంసాగర్ కాలులో పడి ఊపిరి ఆడక మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరు మహిళలపై గ్యాంగ్‌రేప్



- కారులో తీసుకొచ్చి మత్తు ఇచ్చి లైంగికదాడి
- ఒక మహిళ మత్తులో పడిపోగా మరొకరు పారిపోతు కేకలు వేయడంతో వెలుగులోకి
- పోలీసుల అదుపులో నలుగురు దుండగులు

నవతెలంగాణ-ధర్పల్లి

మాయమాటలు చెప్పి ఇద్దరు మహిళలను కారులో తీసుకొచ్చి మత్తు ఇచ్చి నలుగురు కలిసి గ్యాంగ్ రేప్ చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దుబ్బాక, డీబీ తండా శివారులో గల నల్లగుట్ట లక్ష్మి నర్సింహాస్వామి ఆలయ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సురేశ్ అనే వ్యక్తి జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు మహిళలను కారులో తీసుకొచ్చినట్టు సమాచారం.

వివరాలు మెయిన్‌లో..

హామీల జల్లు కురిసేనా..?

- నేడు సీఎం రేవంత్‌రెడ్డి టూర్
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో రాక
- ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, టీయూ అభివృద్ధిపై విద్యార్థుల ఎదురుచూపులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పట్టభద్రులతో సమావేశంలో పాల్గొనేందుకు నేడు (సోమవారం) జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో సీఎం హోదాలో జిల్లాకు రానున్న నేపథ్యంలో విద్యా, వైద్యంలో జిల్లాకు సంబంధించి హామీలు ఇచ్చేనా అని ఎదురుచూపులు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీతో పాటు యూనివర్సిటీలో కోర్సుల పెంపు, అభివృద్ధికి నిధుల కేటాయింపు పట్ల హామీలు వచ్చేనా అని చర్చలు వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా లో విద్యార్థులకు మరింత విద్య అవకాశాలు కల్పించే విధంగా, విద్యా విషయంలో యువతకు సువర్ణ అవకాశాలు కల్పించే విధంగా, కళాశాలలను అభివద్ధి చేసే విధంగా చూడాలని కోరుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ లో డిజిటల్ లైబ్రరీ, ఇంటిగ్రేటెడ్ ఎల్.ఎల్.బి., కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటికల్, సైన్స్, ఆర్ట్స్ స్టూడెంట్స్ కు సంబంధించిన కోర్సులను మరింత విస్తతం చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు. అంతేకాకుండా యూనివర్సిటీకి ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇతరులు తమ సొంత భూమి అంటూ కోర్టుల చుట్టూ వివాదాస్పదంగా తిరుగుతున్నారు. అటువంటి వివాదాస్పద స్థలాలను ప్రభుత్వం నిక్కచ్చిగా తేల్చివేయాలని విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు కోరుతున్నారు. యూనివర్సిటీ స్థలం విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ లాయర్ నియమించి స్థలాన్ని యూనివర్సిటీకి చెందే విధంగా, మరి ఏ ఇతరులు కూడా ఇటువంటి వివాదాస్పదాలు మళ్లీ చేయకుండా, ఒక వేళ యూనివర్సిటీ భూమిపైన వివాదాస్పదాలు చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసే విధంగా ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నిజామాబాద్ జిల్లాని విద్యావంతంగా మరింత విస్తతంగా అభివద్ధి చెందించేందుకు ప్రత్యేక ఇంజనీరింగ్ కళాశాలను, మహిళా కళాశాలను కేటాయించి ప్రత్యేక బడ్జెట్‌ను విద్యాసంస్థలపై, విద్యా సంస్థల అభివద్ధికై కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ కళాశాలను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలని అందులో న్యూరో , గ్యాస్టిక్, ఎండోక్రైనాలజిస్ట్, క్యాన్సర్ వంటి చికిత్సలకు అనుమతి పెంచాలని, ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ ని కూడా త్వరగా అందుబాటులోకి అందించే విధంగా, మరింత డయాగ్నసిస్టిక్ చేసే పరికరాలను, సూపర్ స్పెషాలిటీ అందించే విధంగా చూడాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ఉస్మానియా గాంధీ తరహాలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కూడా సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు రంగం సిద్ధం చేసి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. 500 పడకల ఆసుపత్రిని 1000 పడకల ఆసుపత్రికి అప్‌గ్రేడ్ చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. దీంతో నైనా నిజామాబాద్ మెడికల్ కళాశాలకు వైద్య వత్తిలో సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలు కల్పిస్తూ అభివద్ధి చెందించాలని జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే దారి గుంతలమయం కావడంతో నవ తెలంగాణలో ఈ నెల 17న "పాలకులారా.. రోడ్డును పునర్ నిర్మించండి" శీర్షికను ప్రచురించగా స్థానిక బిజెపి నాయకులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి శివరాత్రి పర్వదినానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆదివారం గుంతల్లో మొరాన్ని నింపి చదను చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ముత్యాల రాజు, కుమ్మరి రాజశేఖర్, వడ్ల కిష్టయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఎంపీలున్నా..

నాలుగు పైసలు తేలే!

- ఉత్తర తెలంగాణ ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానికీ నిధులు సాధించలే..
- ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఆ అసమర్థతను సమర్థించినట్టే!
- శ్రామిక వర్గంపై పెరిగిన బీజేపీ మతోన్మాద పాలకుల దాడులు
- ఈ ఎన్నికలు సహా వచ్చే స్థానిక సంస్థల్లోనూ ఆ పార్టీని నిలువరించాలి
- అందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్



అభివాదం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు


నవతెలంగాణ-కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఉత్తర తెలంగాణాలోనే నలుగురు ఎంపీలు, 8మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. కనీసం ఈ ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టుల కోసంగానీ, కొత్త పరిశ్రమలకు అవకాశం ఉన్న చోటగానీ, ఇదివరకే హామీలిచ్చిన వాటికిగానీ నాలుగు పైసలు తేలేకపోయారు. గత ఐదేండ్లలోనూ ఆ ఎంపీలే ఉన్నా.. ఈ ప్రాంతానికి గుండు సున్నానే తెచ్చారు. ఎంత సేపు మతోన్మాద చర్యలతో ప్రజల మనోభావాలతో ఓట్లు గొల్లగొడుతూ ప్రజాభివృద్ధికి పాటుపడని ఈ పార్టీని రాబోయే ఏ ఎన్నికల్లో ఆదరించినా.. వారి అసమర్థతను సమర్థించినట్టే అవుతుంది. పైగా శ్రామికవర్గంపైనే దాడులు చేస్తూ వారి కష్టాన్ని దోచుకునేలానే పాలిస్తున్న వారిని నిలువరించాల్సిందే!' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్ అన్నారు. ఈనెల 27న జరగబోయే ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. అందుకుగాను ఈ స్థానం పరిధిలోని 13 జిల్లాల పార్టీ కార్యదర్శులతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని ఓడించగల శక్తి ఉన్న కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉత్తరతెలంగాణలోనే ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమ మొదలు సీసీఐకి కేంద్రం నుంచి ఇక్కడి బీజేపీ ఎంపీలు రూపాయి తేలేకపోయారని అన్నారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు పేరుతో ఐదేండ్లు ఎంపీగా చేసిన అరవింద్, ఇప్పుడు మళ్లీ గెలిచి బోర్డు తెచ్చినట్టు ప్రకటించారని అన్నారు. ప్రకటించిన పసుపు బోర్డుకు మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో రూపాయి కేటాయించలేకపోయారని వివరించారు. ఆదిలాబాద్ టూ బీదర్ రైల్వేలైన్, ఉత్తర, దక్షిన భారతదేశాలను కలిపే కాజీపేటలో అదనపు రైల్వేలైన్, ఈ ప్రాంతంలో పెద్దఎత్తున బీడీ పరిశ్రమపై ఆధారపడిన కార్మికుల సంక్షేమం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాజెక్టుల కోసం కొట్లాడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇవేగాక కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ సైతం కనీసం ఒక్క సైనిక్ స్కూల్‌గానీ, నవోదయ పాఠశాలగానీ తేలేకపోయారన్నారు. మెదక్ బీజేపీ ఎంపీగా ఉన్న రఘునందన్‌రావు సైతం ఆ ప్రాంత అభివృద్ధికి కనీసం ప్రయత్నం చేయడం లేదన్నారు. పక్కరాష్ట్రంలో మిర్చి రైతుల కోసం ఎన్‌డీఏ ప్రభుత్వంలోని అక్కడి సీఎం చంద్రబాబునాయుడు కేంద్రంతో మాట్లాడుతుంటే ఇక్కడి బీజేపీ ఎంపీలకు తెలంగాణ మిర్చి రైతులు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కనీసం పక్క రాష్ట్రాన్ని చూసి అయినా సోయి లేదా?అంటూ ఘాటుగా విమర్శించారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన బీజేపీని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఆదరిస్తే మాత్రం వారి అసమర్థతను సమర్థించినవాళ్లమే అవుతామని అన్నారు. దానికితోడు మతోన్మాద రాజకీయాలకు మరింత బీజం వేసినవాళ్ల అవుతామని చెప్పుకొచ్చారు. ఈ పార్టీని నిలువరించేందుకు ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే బుద్ధిచెప్పాలని, అందుకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న వి.నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నిర్ణయాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలోనే చేశామని, పార్టీ నిర్ణయం మేరకు తాము ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం

- ప్రచారాన్ని ముమ్మరం చేసిన పార్టీలు
- పట్టభద్రుల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతున్న పార్టీలు
- ప్రెస్‌మీట్‌లు పెడుతున్న స్వతంత్ర అభ్యర్థులు

నవతెలంగాణ-లింగంపేట్



గ్రామాల్లో ఉపాధ్యాయుల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బిజెపి పార్టీ తమదైన శైలిలో ప్రచారం కొనసాగిస్తుంది. 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ తేదీ దగ్గర పడడంతో అభ్యర్థుల తరపున ఓటర్ల ఇళ్లకు వెళ్లి మరి ఓటర్లు అభ్యర్థిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీల పదవీకాలం మార్చ్ 29న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు రాగా.. అధికార కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల స్థానాన్ని కైవసం చేసుకోవడానికి క్షేత్రస్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి వరకు కార్యకర్తలతో పాటు ఎమ్మెల్యేలను, మంత్రులను ప్రచారంలోకి దింపి పట్టభద్రులు ఓట్లను కైవసం చేసుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తుంది.

ఉపాధ్యాయులకు సంబంధించి టిపిటిఎఫ్ నుంచి అశోక్ కుమార్, పిఆర్టియు సంఘం నుంచి వంగ మహేందర్‌రెడ్డి, బిజెపి మద్దతుతో మల్కా కొమురయ్య పోటి చేస్తున్నారు. వీరితో పాటు మరో 13 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అయితే మూడు ప్రధాన సంఘాల బరిలో నిలిచిన అభ్యర్థులు వారి తరపున సంఘాలు పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. టిపిటిఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్ తరపున టీఎస్‌యూటీఎఫ్ నాయకులు, టీపీటీఎఫ్ సంఘం నాయకులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగసంఘాల నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డితో పాటు పలువురు బరిలో నిలిచారు. వివిధ సంఘాల మద్దతుతో పలువురు అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరపున అభ్యర్థి లేకపోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు బిజెపి అభ్యర్థికి ఓటు వేయాలని రహస్యంగా ప్రచారం జరుగుతున్నట్టు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంటింటికి వెళ్లి ప్రచారం..

ఆయా పార్టీలకు చెందిన నాయకులు పట్టభద్రుల ఇండ్లకు వెళ్లి ఓట్ల కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రలు పంచుతూ తమ అభ్యర్థిని గెలిపిస్తే జరిగే మేలును వివరిస్తున్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్, విందులు వినోదాలు జరిగే ప్రాంతాలకు వెళ్లి హెూటల్లో సమీపంలో గ్రామాల్లోని చావడీల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఓటరులను అభ్యర్థిస్తున్నారు. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి ముడుపులు ముట్ట చెప్పడానికి మంతనాలు కొనసాగిస్తున్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఈసారి పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వడానికి ఇప్పటికే క్షేత్రస్థాయిలో గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు, తాజా మాజీ సర్పంచులు, జెడ్పిటిసిలు, నాయకులు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఫేస్బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వేదికలను ఉపయోగించుకుంటున్నారు. అలాగే అభ్యర్థులపై విమర్శలను కూడా సామాజిక మధ్యమాల నుంచి వాడుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పట్టబద్రుల ఎన్నికల ప్రచారం వేడెక్కింది.

దేశమంటే అంబానీ, అదానీలేనా?

- కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే బడ్జెట్ తప్ప కష్ట జీవులకు ఒరిగిందేమీలేదు
- కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా కార్మికులు రైతులు ఉద్యమించాలి
- సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు



మాట్లాడుతున్న పెద్దివెంకట్‌రాములు



నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర బడ్జెట్ రైతులను పేదలను కార్మికులను నిండా ముంచింది. దేశం అంటే అంబానీ, అదానీలే కాదని' ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తూ గ్రామీణ రైతు కార్మికులను ముంచే పద్ధతుల్లో నిర్మల సీతారామన్ పెట్టిన బడ్జెట్ ఉందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీకి గత సంవత్సరం కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించి 63 వేల కోట్లు ఖర్చు పెట్టినట్టు గుర్తుచేశారు. 'గత బడ్జెట్లో కేటాయించిన కేటాయింపు తప్ప అదనంగా పెంచలేదు. సంవత్సరానికి 200 పని దినాలు పెంచుతూ రోజుకు కూలి 600 రూపాయల ఇవ్వాలని దేశవ్యాప్త పోరాటాలు చేస్తున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. రైతుల సమస్యల పైన, కనీస మద్దతు ధర పైన ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పోరాటం చేస్తున్నా.. రైతులకు కనీస మద్దతు ధర మర్చిపోయారు. అయినా ప్రధాని గారు ఇది పేదల బడ్జెట్ అని చెప్పటం ఎంత మోసపూరితమైన కుట్రనో అర్థమైతుంది. అంతేకాదు హైదరాబాదు నుండి నిజామాబాద్ వెళ్లే రైలు సింగిల్ లైన్ కారణంగా నాలుగైదు గంటల సమయం పడుతుంది. అందుకని అనేక సంవత్సరాలుగా డబల్ ట్రాక్ ఏర్పాటు చేయాలని తెలుగు ప్రజలు కోరుతున్నా.. ఆ ఊసే బడ్జెట్‌లో ఎత్తలేదని తెలిపారు. నిజామా బాద్ జిల్లాకు సంబంధించి పసుపు బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు తప్ప విధివిధానాలు ప్రకటించ లేదు. నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించాడానికి నిధులు లేవు దాని కోసం ఒక రూపాయి బడ్జెట్లో కేటాయించలేదని అన్నారు. బిజెపి ఎంపీలు ఏం చేస్తున్నారో..! ఆత్మ విమర్శ చేసుకోవాలి. మరి ఇది పేదల బడ్జెట్ ఎట్లా అవుతుంది ? అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు మోకరిల్లే బడ్జెట్‌లా ఉన్నదని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ప్రజలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పా లింగం పాట పాడి ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో సిబిటియు నాయకులు గణేష్, కార్తీక్, కటారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, చంద్రకాంత్, రైతు సంఘం నాయకులు, వెంకట్రావు వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈడ గొట్టి సాయిలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, భూమేష్ బుచ్చన్న శంకర్ విజయ్ సర్దార్ సాయికుమార్ రవి కాంతి విజయ రాణి రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

పది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

- విద్యార్థుల ప్రతిభ వెలికితీయడం అభినందనీయం
- ప్రముఖ న్యాయవాది కె సిద్ధిరాములు, కామారెడ్డి పట్టణ ఎస్సై బాల్‌రెడ్డి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు.. పరిశీలిస్తున్న ఎస్ఐ, నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్‌లో గల శ్రీ సాందీపని జూనియర్ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని ప్రముఖ న్యాయవాది కే సిద్ధ రాములు, పట్టణ ఎస్సై బాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించడం కోసం ఎస్ఎఫ్ఐ ఇలాంటి ప్రతిభా పరీక్షలు పెట్టడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి ప్రతిభా పరీక్షలు వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన ఎంతగానో పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా మొదటిసారి పదవ తరగతి విద్యార్థులు బోర్డ్ ఎగ్జామ్స్ రాయబోతున్నా విద్యార్థులు ఈ పరీక్ష రాయడం వల్ల అవగాహన పెరుగుతుందని అన్నారు. ఇలాంటి ప్రతిభా పరీక్షలు భవిష్యత్తులో ఎవరు నిర్వహించిన విద్యార్థులు పాల్గొవాలని కోరారు. అదేవిధంగా పరీక్షల పట్ల విద్యార్థులకు ఉన్న భయాందోళనలు ఇలాంటి పరీక్షల వల్ల వెళ్ళిపోతాయని కావున ఇలాంటి ప్రతిభా పరీక్షలను కచ్చితంగా విద్యార్థులు వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఏ పరీక్షకు హాజరైన 20 నిమిషాల ముందే హాజరై హాలల్లో కూర్చుంటే అక్కడ ఉన్న పరిస్థితులు అవగాహన కలిగి భయం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ అజయ్, ఎం అరుణ్, సాందీపని కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, నితిన్, మణికంఠ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం

నన్ను బలిపశువును చేశారు

- కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయకండి
- మాజీ డీఎస్పీ మదనం గంగాధర్
- పట్టభద్రుల వైపు నిలిచేవారికే ఓటు వేయాలని పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి



కాంగ్రెస్ పార్టీ మోసాలకు అంతులేకుండా పోతుందనీ, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓట్లు రావని తెలిసి.. అభ్యర్థి గెలుపు కోసం ఇతరులను బలి చేస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ విథ్‌డ్రా అభ్యర్థి (మాజీ డిఎస్పి) మదనం గంగాధర్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న ముఖ్యమంత్రి రమ్మంటున్నాడని హనుమంతరావు తనకు ఫోన్ చేసి పిలిపించారని ఆరోజు ముఖ్యమంత్రికే సమయం కుదరకపోవడంతో, మరుసటి రోజు తిరిగి సెక్రటేరియట్‌కు నన్ను తీసుకుపోయి తనకు సమాచారం లేకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెంటనే సామాజిక మధ్యమాల్లో ప్రచారం నిర్వహించారన్నారు. సామాజిక మధ్యమాల్లో ప్రచారాన్ని చూసిన నా మద్దతుదారులు సుమారు లక్ష ఇరవై మంది తనకు వ్యతిరేకంగా మారిపోవడంతో తాను ప్రతి జిల్లాకు తిరిగి తనకు ఏమి జరిగిందో వివరిస్తూ వస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుండి నిలబడిన ఎమ్మెల్సీ అల్ఫోర్స్ అయిన నరేందర్ రెడ్డికి పట్టపద్రులను ఇబ్బందులు తెలవదని, తన విద్యా వ్యాపారాన్ని పెంచుకునేందుకే పోటీ చేస్తున్నట్టు ఆరోపించారు. అతడికి పట్టభద్రులు పూర్తి వ్యతిరేకత ఉందని అది గ్రహించిన తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు పెద్ద ఎత్తున మద్దతు దారులు ఉన్నారని గ్రహించిన వారు నాకు ఎలాంటి సమాచారం లేకుండానే సామాజిక మధ్యములో ప్రచారాలు నిర్వహించారు అన్నారు. పట్టభద్రుల పక్షాన ఎవరైతే నిలబడి పోరాడుతారో వారికే ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట తెలంగాణ మాదిగ సంఘం మహాకూటమి చైర్మన్ కోకల కిరణ్, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద్ తదితరులు ఉన్నారు.

పనిచేయని టెలివిజన్లు

పట్టించుకోని టిఎస్ఆర్‌టిసి

నవతెలంగాణ-జుక్కల్



మూలకు పడ్డ టీవీ

మండల కేంద్రంలోని బస్టాండ్‌లో రెండు టెలివిజన్లు ఉన్నా పనిచేయడం లేదు. టిఎస్ ఆర్‌టిసి పట్టించుకోక పోవడంతో మూలకు పడ్డాయి. ఆర్టీసీ ప్రయాణికుల కొరకు ఈ టెలి విజన్లు ఎంటర్‌టైన్‌మెంట్ కొరకు ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు బోర్ కొట్టకుండా ఉత్సాహ పరిచేందుకు టెలివిజన్‌లు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా అడ్వర్టైజ్మెంట్ ద్వారా ఆర్టీసీకి కొంత లాభం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రయాణ ప్రాంగణంలో ఉన్న టెలివిజన్లను మరమ్మత్తులు చేయించి, ప్రజాధనం వృథా కాకుండా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గురుకుల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



నవతెలంగాణ-బోధన్

గురుకుల పాఠశాలలో 5వ తరగతి, 9వ తరగతిలో ప్రవేశాలకై నిర్వహించిన గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఆదివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన్ పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల కేంద్రాలన్ని, మైనారిటీ గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో సరిపడా సిబ్బంది ఉన్నారా లేరా అని ఆరా తీశారు.

ద్విచక్ర వాహనంపై కుంభమేళాకు



నవతెలంగాణ-పోతంగల్

మండలంలో అన్ని గ్రామాల నుండి వివిధ వాహనాల్లో కుంభమేళాకు వెళ్లారు. కానీ మండలకేంద్రంలోని ఇద్దరు యువకులు స్కూటీపై ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లడం విశేషం. గ్రామానికి చెందిన సితాల సంతోష్, సాదుల శ్రీధర్ స్నేహితులు స్కూటీపై ఈనెల 18న పోతంగల్ నుంచి బయల్దేరి, ప్రయాగ్‌రాజ్ వెళ్లి స్నానాలను ఆచరించారు. అనంతరం వారణాసిలోని కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకొని సుమారు 2350 కిలోమీటర్లు ఐదు రోజుల్లో ప్రయాణం చేసి స్వగ్రామానికి చేరుకున్నారు. వీరు ఇంతకుమునుపు, అయోధ్యకు, శబరిమలైకు కూడా కాలినడకన వెళ్లారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పట్టభద్రుల ఎన్నికల్లో గుణపాఠం చెప్తాం

- రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి : పీడీఎస్‌యు



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోతే పట్టభద్రుల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా 8వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం మీదనే ఆధారపడి పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారని, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీలు పూర్తయిన వారి సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారని, రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించకపోతే ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేకుంటే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదేవిధంగా వచ్చే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగ అభివృద్ధికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా నాయకులు నిఖిల్,నగర నాయకులు సాయికిరణ్, రాకేష్ , భాను,రూపాంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సందడి చేసిన జబర్దస్త్ ఫేమ్ సద్దాం, పులి



పుష్పగుచ్ఛం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం సాయంత్రం శ్రీ భాషిత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా జబర్దస్త్ ఫేమ్ సద్దాం, పులి పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ.. జీవితంలో ఎదగాలంటే చదువు చాలా ముఖ్యం. కాబట్టి చదువుతోనే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. అందరినీ కడుపుబ్బా నవ్వించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ... విద్యార్థుల జీవితంలో పదవతరగతి అనేది మొదటి మెట్టు. మీ జీవిత లక్ష్యాలకు సమయం ఇది అన్నారు. అలాగే పరీక్షల్లో మెళకువలను వివరించడంతోపాటు ప్రతి ఒక్కరు మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులకు మానసిక, విద్య సామర్థ్యాలలో పోటీలు నిర్వహించి, గెలిచిన విద్యార్థులకు శ్రీభాషిత క్రౌన్ ప్రిన్స్, క్రౌన్ ప్రిన్సెస్ బిరుదులతో స్కూల్ కరస్పాండెంట్ సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనం ఎత్తిన అర్బన్ ఎమ్మెల్యే



బోనంతో వస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎల్లమ్మ గుట్టలోని ఎల్లమ్మ ఆలయ దశమావార్షికోత్సవం సందర్భంగా ఎల్లమ్మ అలయ గుడి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అతిపురాతనమైన ఎల్లమ్మ అలయానికి ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. మూడు రోజులుగా పూజ, హెూమం, నైవేద్యం కార్యక్రమాలు భక్తులందరు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేలా ఉందన్నారు. ఎల్లమ్మ ఆశీస్సులతో నగర ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ న్యాలం రాజు, బొబ్బిలి వేణుగోపాల్, రెంజర్ల నరేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యాభైశాతం నిధులు జిల్లాకు కేటాయించాలి

సీఎం టూర్ పట్ల ఎక్స్‌తో ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

సీఎం రేవంత్ రెడ్డి కేవలం ఎన్నికల ప్రచారానికి మాత్రమే జిల్లాకు వస్తున్నారని, అభివృద్ధి కార్యక్రమాల కోసం కూడా జిల్లాకు రావాలని స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తన వ్యక్తిగత ఎక్స్ అకౌంట్‌లో సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. సీఎం సొంత జిల్లాకు కేటాయించిన నిధుల్లో నిజామాబాద్ జిల్లాకు యాభైశాతం నిధులైన కేటాయించాలని కోరుకుంటున్నట్లు ఎక్స్ అకౌంట్లో తెలిపారు.



కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఆర్మూర్‌లో...



మోర్తాడ్‌లో...

రిజర్వేషన్ల పరంగా ప్రభుత్వం విప్లవాన్ని తీసుకురాబోతుంది

- బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి
- పలు చోట్ల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్/మోర్తాడ్

రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ల పరంగా విప్లవాన్ని తీసుకురాబోతుందని బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం శివారులోని లలిత గార్డెన్స్‌లో బాల్కొండ నియోజకవర్గం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలను కల్పించబోతుందని, రిజర్వేషన్ల పరంగా ఒక విప్లవాన్ని తీసుకురాబోతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో నిరుద్యోగులను నిండా ముంచిందని, నోటిఫికేషన్లు వేస్తే కోర్టులలో మగ్గిపోయాయన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు కల్లుకాయలు కాచేలా ఎదురు చూశారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 55 వేల ఉద్యోగాలను కల్పించిందని, రానున్న రోజుల్లో ఉద్యోగ క్యాలెండర్ను విడుదల చేసి లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం కులగణనను చేపట్టి బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ప్రజలకు ప్రశాంతమైన వాతావరణ ఏర్పడిందని, ప్రజా ప్రభుత్వంలో సామాన్యుడి సైతం పనులు చేసుకునే వీలు కల్పించిందన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇల్లు కట్టుకోవాలనుకునే ప్రజలకు రూ.3వేలకే ఇసుక ట్రాక్టర్ అందిస్తూ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాన్ని నెరవేరుస్తున్నమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కనీస అభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్, సీడ్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తహర్ బిన్ హందన్, కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పట్టభద్రులు మీ ఓటును వృథా చేయవద్దు: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఆర్మూర్ : పట్టభద్రులు మీ ఓటును వపట్టణంలోని పివిఆర్ హెూటల్, మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో పట్టభద్రులతో సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శం రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ బుకియా మురళి నాయక్ మాట్లాడారు. మాయ మాటలు చెప్పే బీజేపీ, బీఆర్ఎస్, నాయకుల మాటలు నమ్మి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పట్టభద్రుల సమాస్యలకై కొట్లాడే నరేందర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హాంధన్ , మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి , సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ నారా చంద్రబాబు , మున్సిపల్ మాజీ చైర్మన్ పండిట్ పవన్, నిజాంసాగర్ కెనాల్ మాజీ చైర్మన్ ఎలా సాయి రెడ్డి ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్ ఆలూరు లోకేశ్వర్ మండలాల అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ రవి గౌడ్, మార్కెట్ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ జీవన్, మాజీ కౌన్సిలర్ కాశీరం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్ర పాలకుల కంటే ఎక్కువగా కెసిఆర్ దోచుకున్నాడు

మోర్తాడ్ : ఆంధ్ర పాలకులు దోచుకున్న దాని కంటే ఎక్కువ 100 రేట్లు కేసిఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. మండలంలోని జాతీయ రహదారి 63 పక్కన గల లలిత గార్డెన్లో పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ నిధులు నియామకాలు అంటూ అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను దోచుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, ప్రస్తుతం కెసిఆర్ కుటుంబ ఆస్తి ఎంతో ప్రజలకు తెలుపాలని అన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కెసిఆర్ ప్రభుత్వానికి గత ఎన్నికల్లో ప్రజలు ఎల బుద్ధి చెప్పారు అదేవిధంగా పట్టభద్రులు అందరూ తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానంలో ఉత్సవాలు

- నేటినుంచి మహాలింగేశ్వర స్వామి ఉత్సవాలు
- ప్రతి ఏటా మహాన్నదాన సత్రం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోగల రెండు వందల ఏళ్ల క్రితం నాటి మర్రిచెట్టు (పడిలేచిన మర్రిచెట్టు వృక్షం) శ్రీ మహా శివలింగేశ్వర స్వామిగా ప్రస్తుతం కొలువై ఉంది. 18 ఏళ్ల క్రితం 2005 జనవరి 28న భారీ ఈదురుగాలులకు మర్రిచెట్టు నేలకు ఒరిగింది. 33 అడుగుల వృత్త విస్తీర్ణం ఉన్న ఈ మహా వృక్షం కూకటిళ్లతో పడిపోయింది. అనంతరం అదే సంవత్సరం 2005 జూన్ 28న ఎలాంటి మానవ ప్రయత్నం లేకుండా యదాస్థానంలో నిలబడిందని గ్రామస్తులు తెలిపారు. ఆనాటి నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి మొదలుకొని పక్క రాష్ట్రలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు భారీగా తరలివస్తు ముడుపులు కడుతూ శ్రీ మహా శివలింగేశ్వర స్వామి వారి మొక్కులు తీర్చుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 24 నుంచి 27 వరకు స్వామి వారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26 బుధవారం పార్వతి సమేత శివలింగేశ్వర స్వామి కళ్యాణం జరుగుతుంది. 27న గురువారం పెద్ద మొత్తంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. కావున మండలం చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఆలయ ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.



ఆలయం చుట్టూ ఇతర దేవాలయాలు..

పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం చుట్టూ పలు ఆలయాలు వెల్లువిరిసాయి. దాతల సాయంతో, గ్రామాభివృద్ధి కమిటీ తోడ్పాటుతో దేవస్థానం అభివృద్ధి చేపట్టారు. ఆలయ ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థం సాయిబాబా ఆలయం, 21 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దేవస్థానం వద్ద గార్డెన్ ఏర్పాటు చేశారు. గార్డెన్ మధ్యలో శివుని విగ్రహం చూడ ముచ్చటగా ఉంది. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం సైతం ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో మరో దాత ముందుకు వచ్చి యాగశాలకు తనవంతు కృషిని అందిస్తున్నారు. ప్రతి ఏటా 50 నుంచి 60 మంది వరకు స్వామి వారి ములధారణ చేస్తారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..



పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం శ్రీ మహా శివలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయాన్ని ముస్తాబు చేయించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహిస్తున్నాం. ఈ నెల్ 27 గురువారం భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

సిద్ద రమేష్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు..

జాబ్ మేళా విజయవంతం



జాబ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా నిరుద్యోగుల జాబ్ మేళా విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.హైదరాబాద్ లోని ఎస్. కే. ఎస్. ఎస్, కంపెనీ సౌజన్యంతో ప్రముఖ పారిశ్రామిక వేత్త చిట్టాపూర్ గ్రామవాసి ఏనుగు దయానంద్ రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళ ఆదివారం వసంత ఫంక్షన్ హాల్ చిట్టాపూర్‌లో ఏర్పాటు చేశారు. ఈ జాబ్ మేళాలో 70మందికి పైగా మహిళా నిరుద్యోగినిలు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగానికి ఎంపికైన మహిళా నిరుద్యోగులకు నిర్వాహకులు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గోపాల్ కృష్ణ, ఆర్గనైజర్ రాజ్‌కుమార్, న్యావనంది గణేష్ ,సందీప్,కే.యస్ డి మూర్తి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పట్టభద్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నిజామాబాద్‌లోని భూమారెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగే పట్టపద్రుల సమావేశంలో పాల్గొనున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై సమావేశంలో పట్టభద్రులు అధిక మొత్తంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కచ్చితంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల, జిల్లాలోని పట్టపద్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలోని సమస్యల గురించి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, హైస్కూల్ హెచ్ఎం లింగన్న, వైస్‌ప్రిన్సిపాల్ మురళి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్కూల్ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గురువుల సూచనలతో ఉన్నతులుగా ఎదగాలి

- రిటైర్డ్ అదనపు ఎస్పీ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న రిటైర్డ్ అదనపు ఎస్పీ లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులు, గురువులు చెప్పిన సూచనలు పాటించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని రిటైర్డ్ అదనపు ఎస్పి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని విజేత జూనియర్ కళాశాల రజతోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి వారితల్లిదండ్రులు, గురువులు, పెద్దల సూచనలు పాటించాలని కోరారు. అయితేనే విద్య అనేది అలవడుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ప్రయత్నిస్తే విజయం సాధ్యమవుతుందని, కావున మీ లక్ష్యాలను మరవద్దని సూచించారు. గురువులను, పెద్దలను ఎంత గౌరవిస్తే అంత ఎదుగుతారన్నారు. తాను ఒక పోలీస్ అధికారిగా ఉన్నప్పుడు మానవతా దృక్పథంతో ఎందరికో సహాయపడ్డానని గుర్తు చేశారు. కళాశాలలో ముఖ్యంగా ఈవ్ టీజింగ్ చేయడం ప్రతిచోట జరుగుతుందని ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని విద్యార్థినులు వారిని చెప్పు దెబ్బతో గుణపాఠం చెప్పాలని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్, విజేత జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు రమణారెడ్డి, అంజనదేవి, ప్రైవేట్ విద్యా సంస్థల అధినేతలు చక్రవర్తి, కృష్ణమోహన్, హరికృష్ణ, మిద్దెల రాజు, కళాశాల పూర్వ విద్యార్థి నిర్మల్ ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

విలువైన ఓటుతో గెలిపించండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వర్కర్ జడ్సన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తన పదవి కాపాడుకోవడానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని సీఎం ఓడిస్తున్నాడని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వర్కర్ జడ్సన్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు , తెలుగుదేశం పూర్వ కార్యకర్త అయిన మేడిపల్లి సత్యం, ఆయన అత్యంత సన్నిహితుడైన ప్రసన్న హరికృష్ణకు ఎమ్మెల్సీ బీఫామ్ కోసం విస్తృతమైన కృషి చేసినప్పటికీ టికెట్‌కోసం ప్రయంత్రించినప్పటికీ ఐటి ఇండస్ట్రీస్ మినిస్టర్ శ్రీధర్ బాబు తన పంతం నెగ్గించుకొని నరేందర్ రెడ్డికి టికెట్ ఇప్పించారన్నారు. దీంతో పొన్నం ప్రభాకర్‌ను రంగంలో దించి ప్రసన్న హరికృష్ణతో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయించారన్నారు. అనంతరం ప్రసన్న హరికృష్ణ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆయన సూచనల మేరకు టికెట్ కోసం బీఆర్ఎస్ పార్టీని ఆశ్రయించాక అక్కడ అనుకూలించకపోవడంతో బిఎస్పి బీఫామ్ తెచ్చుకొని పోటీలో ఉంచారని తెలిపారు. శ్రీధర్ బాబు ప్రాబల్యాన్ని నియంత్రించాలని, కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాలన్న వ్యూహంలో భాగంగా రేవంత్ రెడ్డి ఈ పన్నాగం పన్నుతున్నారని అన్నారు. కరీంనగర్ కేంద్రంగా పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో దుద్దిళ్ల శ్రీధర్ శ్రీధర్ బాబు నాయకత్వాన్ని నియంత్రించాలని అదే వ్యూహంతో ఉన్నారని, గనుక ప్రజలు దీని గ్రహించాలని కోరారు. 34 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలో నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా కృషి చేసిన తనను ఏ విధంగా నియంత్రించారో అందరికీ తెలిసిందేనని అన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టబదులందరూ విలువైన ఓటుతో బలపరచాలని కోరారు.

నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వండి

- ప్రచారం నిర్వహించిన వర్ధన్న పేట ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఏర్గట్ల



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ఏర్గట్ల మండలకేంద్రానికి వచ్చారు. పట్టభద్రులతో సమావేశమైన అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీఎం రేవంత్ రెడ్డి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సోమ దేవరెడ్డి, డీసీసీ డెలిగెట్ గడ్డం జీవన్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు రేంఢ్ల రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో జిల్లా నాయకుల ప్రచారం



నవతెలంగాణ-రామారెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో ఆదివారం పలు మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, యువతకు ఉపాధి కల్పనలో భాగంగా చేపట్టిన ఉద్యోగ కల్పనను దృష్టిలో పెట్టుకొని , రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నందున మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో వైద్య సేవలు



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల పరీక్షలో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సేవలు నిర్వహించడానికి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సేవలు నిర్వహించారు. అలాగే రాజంపేట్ మండలంలోని గురుకుల పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది వైద్య సేవలు నిర్వహించారు.



టోల్ వసూళ్లలో లోకల్ పంచాయితీ

- స్థానిక వాహనాలకు గతంలో ఉచితం..
- ప్రస్తుతం డబ్బులు వసూలు
- ఎవరికి ఫ్రీ లేదంటున్నా యాజమాన్యం
- ఫ్రీ లేకుంటే ధర్నా తప్పదు- వాహనదారులు

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ పట్టణ కేంద్ర సమీపంలోని 44వ జాతీయ రహదారి పై ఉన్న టోల్ ప్లాజా వద్ద లోకల్ వాహనదారులకు టోల్ వసూలు విషయమై నిత్యం పంచాయితీ నెలకొంటుంది. గతంలో తమకు టోల్ వసూలు చేసే వారు కాదని, కానీ ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు అక్కడి సిబ్బంది సైతం వాహనదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

భిక్కనూర్ మండలం నుంచి ప్రతిరోజు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, విద్యుత్, వైద్య, ఉపాధ్యాయ ఉద్యోగులు కారులో కామారెడ్డికి వెళ్లి వస్తూ ఉంటారు. ప్రతిరోజు వచ్చి వెళ్లడానికి 140 రూపాయలు ఫాస్ట్ ట్రాక్ నుండి కట్ అవడంతో నెలకు 4,200 రూపాయల ఖర్చు అవుతుంది. అలాగే మండలంలోని టాక్సీ వాహనదారులు కిరాయి నిమిత్తం కామారెడ్డి అప్పుడప్పుడు వెళుతున్న సమయంలో ఫాస్ట్ ట్రాక్ కట్ అవుతుంది. మండల అధికారులు నిత్యం టోల్‌గేట్ దాటి అంతంపల్లి, జంగంపల్లి గ్రామాలు సందర్శించడానికి వెళ్లాల్సి ఉంటుంది. అధికారులకు సైతం కారులో వెళుతున్నప్పుడు ఫాస్ట్ టాగ్ కట్ అవడం కారణంగా ఆందోళన చెందుతున్నారు.

లోకల్ వాహనాలకు టోల్ వసూలు..

టోల్ ప్లాజా ఏర్పడిన నాటి నుండి గత కాంట్రాక్టర్ కాంట్రాక్టు ముగిసే వరకు భిక్కనూరు మండల టాక్సీ, సొంత వాహనదారులకు, అధికారులకు ఉచితంగానే ఎలాంటి టోల్ వసూలు చేయకుండా పంపించేవారు. ప్రస్తుతం హైవే కన్‌స్ట్రక్షన్ ట్రస్ట్ వన్ టోల్ ప్లాజా కాంట్రాక్ట్ తీసుకున్న నాటినుండి లోకల్, టాక్సీ, అధికారులు అని ఎలాంటి సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి టోల్ వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లోకల్ వ్యక్తులు, అధికారులు అని చెబితే టోల్ ప్లాజా యాజమాన్యం చూసి చూడనట్టు వదిలేసినా.. టోల్ బూత్‌లో పనిచేసే సిబ్బంది మాత్రం వాహనదారులపై దురుసుగా ప్రవర్తిస్తూ టోల్ వసూలు చేస్తున్నారు.

వాహనదారులపై సిబ్బంది దురుసు ప్రవర్తన..

టోల్ ప్లాజా యాజమాన్యం కొందరి కార్లు లోకల్ ఆధార్ కార్డు చూపిస్తే చూసి చూడనట్లు వ్యవహరించిన టోల్ బూతులో పనిచేసే సిబ్బంది మాత్రం కారు డ్రైవర్ల పై, యజమానులపై దౌర్జన్యం చేస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. లోకల్ వ్యక్తులము అని చెప్పిన మాకు మీరు ఎవరో తెలియదు టోల్ కట్టాల్సిందే అని హుకుం జారీ చేస్తూ ఒకవేళ కట్ట లేకపోతే వాహనాలు వెళ్లిపోయిన తర్వాత నెంబర్ ప్లేట్ సహాయంతో ఫాస్ట్ టాగ్ నుండి అమౌంట్ కట్ చేస్తున్నారు. తిరిగి వాహనదారులు ఇదేమిటని ప్రశ్నిస్తే మాకేమి సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. కట్టకుండా వెళ్ళిపోయిన వారిని టార్గెట్ చేస్తూ వాహనాలను గుద్దడం, మిర్రర్ విరగట్టడం వంటివి చేస్తున్నారు.

కారు మిర్రర్ పగలగొట్టిన టోల్ ప్లాజా సిబ్బందిపై ఫిర్యాదు



నవతెలంగాణ-భిక్కనూర్

కారు మిర్రర్ పగలగొట్టిన టోల్‌ప్లాజా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కారు మెకానిక్ శ్రీకాంత్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల ప్రకారం.. మెకానిక్ శ్రీకాంత్ తన కారు కామారెడ్డి వైపు తీసుకెళ్తున్న సమయంలో టోల్ ప్లాజాలో తాను లోకల్ తిప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని అని చెప్పిన పంపించలేదు. టోల్ ప్లాజాలో పనిచేస్తున్న రణదీప్ రెడ్డి అనే వ్యక్తి టోల్ బూత్ వద్దకు వచ్చి కారు ఫాస్ట్ ట్రాక్ తీసుకొని కారు పక్కకు తీస్తున్న సమయంలో సిబ్బంది కారు మిర్రర్ విరగొట్టి దురుసుగా ప్రవర్తించినట్టు తెలిపారు. ఆగ్రహం చెందిన శ్రీకాంత్ టోల్ ప్లాజా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ప్రతినిత్యం టోల్ ప్లాజా లో పనిచేస్తున్న సిబ్బంది దురుసుతనం కారణంగా వాహనదారులతో గొడవలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనదారులతో గొడవలు జరగకుండా టోల్ ప్లాజా యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు తెలియజేస్తున్నారు.

గతంలో ఉచితం.. ఇప్పుడు డబ్బులు

టోల్ ప్లాజా ఏర్పడిన నాటి నుండి ప్రతి సంవత్సరం ఒక్కో కాంట్రాక్టర్ మారుతున్న సమయంలో వచ్చిన కాంట్రాక్టర్లు లోకల్ వాహనాలను ఇబ్బందులకు గురి చేయకుండా, పనిచేస్తున్న సిబ్బంది సైతం లోకల్ వ్యక్తులే కావడం కారణంగా ప్రతి లోకల్ వాహనాన్ని ఉచితంగానే టోల్ వసూలు చేయకుండా పంపించేవారు. కానీ ప్రస్తుత కాంట్రాక్టర్ ఎవరిని వదలకుండా ప్రతి ఒక్కరి నుండి టోల్ వసూలు చేయడం, టోల్ ప్లాజాలోకి కొత్త సిబ్బంది రావడం వలన కట్టకుండా వెళ్లిపోయిన వారికి నెంబర్ ప్లేట్ సహాయంతో టోల్ వసూలు చేయడం వంటి కారణంగా వాహనదారులు నిత్యం టోల్ ప్లాజా యాజమాన్యంతో గొడవలకు దిగుతున్నారు. భిక్కనూర్ నుండి కిలోమీటర్ దూరం కూడా లేని లోకల్ వాహనాలకు కూడా టోల్ వసూలు చేయడం ఏంటని లోకల్ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఫ్రీ లేకుంటే ధర్నా తప్పదు వాహనదారులు..

లోకల్ సొంత, టాక్సీ వాహనాలకు ఉచితంగా పంపించకుంటే టోల్ ప్లాజా ముందు ధర్నా చేస్తామని వాహనదారులు ప్రస్తుత టోల్ ప్లాజా యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం టోల్ ప్లాజా మేనేజర్ పోలీస్ స్టేషన్ లో వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి కాంట్రాక్టర్‌కు సమాచారాన్ని చేరవేసి లోకల్ టాక్సీ వాహనాలకు వెళ్లి రావడానికి 90 రూపాయలు, లోకల్ సొంత వాహనదారులు 340 చెల్లిస్తే ఫ్రీ పాస్ ఇస్తామని తెలియజేశారు. గతంలో ఏ విధంగా వాహనదారులకు ఉచితంగా పంపించారో అదేవిధంగా పంపించాలని లేనిచో టోల్ ప్లాజా ముందు ధర్నా చేస్తామని వాహనదారులు తెలియజేస్తున్నారు.

లోకల్ వాహనాలకు ఉచితంగానే పంపించాలి..
రాజా బాబు (న్యాయవాది)

44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న భిక్కనూర్ పట్టణానికి నిత్యం అధికారులు, లోకల్ కార్లు, టాక్సీ వాహనాలు కామారెడ్డి కి వెళ్తూ వస్తుంటాయని గతంలో ఉన్న విధంగానే లోకల్ వాహనాలకు ఉచితంగానే పంపించాలన్నారు. లోకల్ వ్యక్తుల ఆధార్ కార్డు, వాహనాల ఆర్సీ పేపర్లు చూసి టోల్ ప్లాజా యాజమాన్యం ఉచితంగా పంపించే విధంగా చర్యలు తీసుకోవాలి.

కాంట్రాక్టర్ ఏ విధంగా చెప్తే ఆ విధంగా చేస్తాం..
టోల్ ప్లాజా మేనేజర్ ప్రకాష్

ప్రస్తుతం నూతన కాంట్రాక్ట్ తీసుకున్న నాటినుండి కంప్యూటర్లలో కొత్త సాఫ్ట్ వేర్ పొందుపరిచారు. సాంకేతిక కారణాల వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లోకల్ వాహనదారుల సమాచారం తీసుకొని కాంట్రాక్టర్‌కు తెలియజేసి కాంట్రాక్టర్ చెప్పిన విధంగా లోకల్ వాహనాలకు వెసులుబాటు కల్పించే చర్యలు తీసుకుంటాము. కొద్దిరోజుల సమయం తర్వాత పూర్తి వివరాలు లోకల్ వాహనదారులకు తెలియజేస్తాము.

పదవ తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించిన పూర్వ విద్యార్థులు



టాలెంట్ టెస్ట్ నిర్వహించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి/బీబీపెట్

తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి బాలుర ఉన్నత పాఠశాల బిబిపేటలో ఆదివారం 2003 - 2004 ఎస్ఎస్సి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పదవ తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని ఐదు పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు 109 మంది పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఇందులో తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి ఉన్నత పాఠశాల బీబీపేటకు చెందిన పదవ తరగతి విద్యార్థిని కుమారి అక్షయ ప్రథమ స్థానం సాధించి 3000 రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మూల రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయ బృందం కుమారి అక్షయను అభినందించారు.

పౌర హక్కులపై అవగాహన ఎక్కడ..?

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా గ్రామాల్లో గతంలో డివిజన్ మండల స్థాయి ప్రభుత్వ ఉద్యోగులందరూ కలిసి గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ అంటరానితనం నిర్మూలన, రెండు గ్లాసుల పద్ధతి నిర్మూలన కుల మతాలు అందరూ ఒకటేన అనే విషయాలపై అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం కొద్దిరోజులుగా అలాంటి అవగాహన కార్యక్రమాలు ఎక్కడ నిర్వహించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది తక్కువ సామాజిక వర్గంగా చూపుతో దూచిస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. గత సంవత్సరం మండల కేంద్రంలో కులాంతర వివాహం చేసుకున్న జంటను కుల బహిష్కరణ చేసిన సంఘటన మరవకముందే మండలంలోని బ్రహ్మజీ వాడి గ్రామంలో వెలుగు చూసిన ఘటనే నిదర్శనం. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ దృష్టికి వెళ్లగా ఆయన గ్రామాన్ని సందర్శించి ఘటనపై తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీస్ రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని గ్రామీణ ప్రాంతా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర కమిషన్ ఏకంగా ఆదేశించి అప్పటికి 20 రోజులు గడుస్తున్న నిర్వహించడం లేదన్నట్టు సమాచారం. ఇప్పటికైనా స్పందించి అధికారులు ప్రతినెల గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే కుల వివక్షపై మార్పులు తీసుకురావడానికి కొంతైనా మేలు జరుగుతుంది.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి



కామారెడ్డి: మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు తలారి ప్రభాకర్

నవతెలంగాణ-కామారెడ్డి/తాడ్వాయి/లింగంపేట్

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అల్ఫోర్స్ వూట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాదన్యత ఓటు వేసి భారీ మేజారిటితో గెలపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాద్యాక్షులు తలారి ప్రభాకర్ అన్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం తుజాల్ పూర్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్బంగా సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు.

విద్యావంతులు, మేధావులు, యువకులంత ఎకమై నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన ఎడాదిన్నర కాలంలో 50 వేలకి పైగా ఉద్యోగాలని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఆయా ప్రైవేటు రంగాలలో విధులు నిర్వహిస్తున్న పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోనే నర్సయ్య, మేడిపల్లి ప్రశాంత్, అందే శ్రీదర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళల ప్రచారం..

తాడ్వాయి : కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మహిళా నాయకులు ఆదివారం ప్రచారం చేపట్టారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలపట్టబద్రుల అభ్యర్థిగా ఉట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళ నాయకురాలు మమత, గ్రామ అధ్యక్షులు మెట్టు రామచంద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బాలంబాయ్‌ల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఇండ్ల వద్దకు వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గైని జ్యోతి, పార్టీ కార్యకర్తలు పట్ట బద్రులైన ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని పలు గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదేశానుసారం మండలంలోని పోతాయపల్లి, కోమటిపల్లి, కన్నాపూర్, పోల్కంపేట్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పట్టబద్రుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ కమిటీ సభ్యులు మణిగిరి నాగరాజు, ఎల్లమయ్య విట్టల్, పోతాయిపల్లి గ్రామ అధ్యక్షులు గేర బోయిన శంకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కీసరి అజయ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గురుకులాల ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి

బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆరవ తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు ఉన్న బ్యాక్లాగ్ సీట్ల భర్తీ కోసం పరీక్షలు నిర్వహించామని 597 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు హాజరు కాలేదని ప్రిన్సిపల్ బి సురేఖ తెలిపారు. ఐదో తరగతిలో చేరెందుకు పూర్తి సీట్లకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

గుండె ఆపరేషన్‌కు రక్తదానం



నవతెలంగాణ-కామారెడ్డి

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్య శాలలో బేక్రియాల్ గ్రామానికి చెందిన లక్ష్మీకి గుండె ఆపరేషన్ నిమిత్తమై రక్తం అవసరం కావడంతో సింగరాయపల్లి గ్రామానికి చెందిన అంకం బాలకిషన్ ఆదివారం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లా డుతూ.. గతంలో గర్భిణీ మహిళలకు, తలసేమియా చిన్నారుల కోసం రక్తదాత బాలకిషన్ రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు. సకాలంలో రక్తాన్ని అందజేసిన బాలకిషన్‌కు ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తరపున అభినందనలు తెలియజేశారు.

గర్భిణీకి రక్తదానం చేసిన భరత్ రావు..

జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మ అనే గర్భిణీకి అత్యవసరంగా ఆపరేషన్ నిమిత్తమై రక్తం అవసరం కావడంతో తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన భరత్‌రావు రక్తం అందించినట్లు జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎవరికైనా రక్తం అవసరం ఉంది అనీ మెసేజ్ గాని ఫోన్ గాని రాగానే 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు రక్తదానంకు ముందుండాలని కోరారు. రక్తదాతకు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ ముదాం శ్రీధర్ పటేల్, మ్యాన రంజిత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేషంట్ కుటుంబసభ్యులు, బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసన్న హరికృష్ణను, సాయన్నను గెలిపించండి

- బియస్‌పి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎమ్మెల్సీలుగా ప్రసన్న హరికృష్ణను, యటకారి సాయన్నను గెలిపించాలని బియస్‌పి జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ కోరారు. జిల్లా కేంద్రంఓలని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థిగా బహుజన బీసీ ముద్దు బిడ్డ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రాజీనామా చేసిన ప్రసన్న హరి కృష్ణకు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి యస్ పి అభ్యర్థి బహుజన బిసి బిడ్డ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసిన సాయన్నకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు అందరు కలిసి వీరికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోకొండ రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల సురేష్, కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు ఈసిరి కాయల సాయిలు, కామారెడ్డి అసెంబ్లీ ఉపాధ్యక్షులు నత్తి జీవన్, ఈసరి హరి భూషణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్

ప్రసన్న హరికృష్ణని భారీ మెజారిటీతో గెలిపించాలి

ప్రసన్న హరికృష్ణ ని భారీ మెజారిటీతో గెలిపించాలని విద్యార్థి సేన కామారెడి జిల్లా అధ్యక్షుడు కొత్మీర్కర్ వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం విద్యార్థి సేన ఆధ్వర్యంలో అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్,మెదక్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. కార్పొరేట్, కామన్ మ్యాన్‌కి మధ్య జరుగుతున్న పోరాటంలో పట్టభద్రులు అందరు ఏకమై నిరుద్యోగ సమస్యలు తెలిసిన వ్యక్తి తన 19 సంవత్సరాల సర్వీస్ ను వదులుకొని తెలంగాణ సమాజం కోసం, యువత కోసం ముందుకు వస్తున్నటువంటి డాక్టర్ ప్రసన్న హరి కృష్ణ ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సేన నాయకులు సతీష్, వంశీ, రాజు, రాహుల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం గ్రామపంచాయతీ పరిధిలోని మంచినీరు వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. కూలేందుకు సిద్ధంగా ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంక్ పక్క నుంచి గుడి తండాకు పోయే దారి ఉన్నది. ఆ ట్యాంక్ చూచి ఆందోళన చెందుతున్నారు. ట్యాంకు పెచ్చులు ఊడుతున్నాయి. నీరు నిలువ ఉండకుండా పోతుంది. నిజామాబాద్‌కు ఇతర తండాలకు దారి ఉన్నది వారు కూడా ఈ రోడ్డు వెంబడి వెళ్లేవారు జంకుతున్నారు. యాచారం గ్రామస్తులు మాట్లాడుతూ ఆ ట్యాంకును తొలగించాలని కోరుతున్నారు. ఆ ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకును నిర్మించాలని వారు కోరుతున్నారు. ఆ ట్యాంకును తొలగించకపోతే ఎప్పుడైనా గూలుతే పెద్ద ప్రమాదమే జరగవచ్చని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి నూతన ట్యాంకును నిర్మించాలని వారు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు

- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపైకి వస్తున్న ముళ్లపొదలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్ద ఏడ్గి నుంచి పెద్దగుల్లా వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలు ఏపుగా పెరగడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో 14కోట్లతో నిర్మించిన పెద్ద ఏడ్గి, పెద్దగుల్లా రెండు వరుసల రోడ్డును అర్ధాంతరంగా చిన్నగుల్లా చౌరస్తా వరకు మాత్రమే రోడ్డు వేసి వదిలేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే రోడ్డును వదిలేసి వెళ్ళిపోయాడు. వేసిన రోడ్డుకు ఇరువైపులా ముళ్ళపొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో ప్రయాణికులకు ప్రమాదాలు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడంలేదని, వెంటనే ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు దృష్టి సాదిరించాలని ప్రయాణికులు కోరారు. లేకుంటే జిల్లా అధికారులను కలిసి సమస్యలు ఫిర్యాదు చేసి విన్నవిస్తామని ప్రయాణికులు తెలియజేశారు.

ఎర్రపహాడ్ వెళ్లాలంటే ముక్కు మూయాల్సిందే

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్ర పహాడ్ గ్రామానికి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిందేనని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలోని వాగు వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారి పక్కన సంచుల్లో కోళ్ల వ్యర్థాలను తీసుకొచ్చి అక్కడ పడేస్తుండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. దుర్వాసనతో శ్వాసకోస సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని.. కావున సంబంధిత అధికారులు స్పందించి వ్యాపారులకు అవగాహన కల్పించాలని, అయినా వినకుంటే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పడేసి ఉన్న వ్యర్థాలు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

గ్రామశాఖ అధ్యక్షుడిని పమర్శించిన టీజీఎండిసి చైర్మన్



నవతెలంగాణ-బాల్కొండ

కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు సంజీవ్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడడంతో కాలుకు తీవ్ర గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఆదివారం సంజీవ్‌గౌడ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, రాజ్ కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, సంతోష్‌గౌడ్, తదితరులు, నాయకులు పాల్గొన్నారు.

పోచారంలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని పోచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు వేముల కిరణ్, యూత్ అధ్యక్షులు ఆసిఫ్, మేకల రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు



పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు చుక్కాపూర్ లక్ష్మి నరసింహ స్వామి ని దర్శించుకున్నారు. కుంకుమార్చనలు, వాహన పూజలు, బాసింగాలు, ఒడిబియాలు, పుట్టు వెంట్రుకలు గండ దీపాలు లతో పాటు ఇతర మొక్కుబడులు వివిధ జిల్లాలలో నుండి వచ్చి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్ రావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవితానికి పాఠశాల విద్య పునాది లాంటిది

- కృషి హై స్కూల్ లో ఫేర్వెల్ డే హంగామా



నవతెలంగాణ-భీంగల్‌రూరల్

భీమ్‌గల్ పట్టణంలోని శనివారం రాత్రి కృషి హై స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ వేముల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై మహేష్ సర్వ సమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ. విద్య నభ్యసించిన పాఠశాలను మరవద్దని, మెరుగైన జీవితానికి పాఠశాల విద్య పునాది లాంటిదని, తల్లిదండ్రులను విద్యనభ్యసించిన పాఠశాలను మరిచి పోకూడద ఉన్నత లక్ష్యంతో విద్యార్థిని విద్యార్థులు చదివి లాయర్, కలెక్టర్, ఐపీఎస్, కావాలని అన్నారు. తల్లిదండ్రులకు విధేయులై సేవలందిస్తూ కుటుంబాన్ని సంరక్షించాలని అన్నారు. అందరి మెప్పు పొంది సమాజ సేవ చేయాలని కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ. విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నంత స్థాయిలో ఎదగాలని, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఉన్నతశ్రేణి మార్కుల పొందిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోని 10 జీపిఏ సాధించి మండల జిల్లా స్థాయిలో పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులు మొబైల్ ఫోన్ లకు అలవాటు పడకుండా దూరంగా ఉండి కష్టపడి చదివి విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అన్నారు. సాంస్కృతిక నృత్యాలచే ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మల్లెల మంజు, మాజీ కౌన్సిలర్ రజాక్,పిటి దేవలింగం, ఉపాధ్యాయులు నవీన్, అమితా,హేమలత, ఉపాధ్యాయులు, బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పదు

- విద్యాశాఖ అధికారి రామస్వామి



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రతి ఉద్యోగి కిపదవి విరమణ తప్పదని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి అన్నారు. ఆదివారం కృష్ణాజివాడి పాఠశాల లో ఏర్పాటుచేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నామ గంగాధర్ ఉద్యోగ వృత్తిలో 41 సంవత్సరాలు విద్యార్థులకు అత్యంత సేవలు చేసి పేరు ప్రఖ్యాతలు పొందా రాణిఅన్నారు. ఉపాధ్యాయులతో విద్యార్థిని విద్యార్థులతో కలుపుగోలుగా ఉండి విధులు పూర్తి చేశారని అన్నారు ప్రభుత్వం నిర్వహించే పలు కార్యక్రమాల్లో అత్యంత ఉత్సాహంతో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి, లత,ఎస్ఎంసి మాజీ చైర్మన్ బాలకృష్ణ, బాలవికాస చైర్మన్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు గిరి, రమేష్, శ్రీహరి, నివేదిత, సుజాత, శ్వేత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీజీ సెట్ పరీక్ష

- పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో జరిగిన టీజీ సెట్ పరీక్షకు 190 మంది బాల బాలికలు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు మాత్రమే గైహాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, స్థానిక పాఠశాల కళాశాల ప్రధాన చార్యులు గంగా శంకర్ తెలిపారు. అర్హత పరీక్ష రాసేందుకు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎడపల్లి తహసిల్దార్ ధనవాల్ సింగ్ ఇతర శాఖల అధికారులు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఆయన సైతం పర్యవేక్షించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష మధ్యాహ్నం 1:00 గంట వరకు కొనసాగింది. ఏది ఏమైనా పనికి టీజీ సెట్ ఐదవ తరగతి అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల చీఫ్ సూపర్నెంట్, స్థానిక గురుకుల పాఠశాల కళాశాల ప్రధానాచార్యులు గంగా శంకర్ తెలిపారు.



భీంగల్ రూరల్ : మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్‌లో...

ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం చేయాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్/బాల్కొండ/ఆర్మూర్

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సర్వసమాజ్ కమిటీ అధ్యక్షులు నీలం రవి కోరారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదేశానుసారం భీంగల్ పట్టణంలోని 12 వార్డుల యువకులతో ఆదివారం మీటింగ్ ఏర్పాటు చేశారు. భీంగల్ పట్టణంలోని ఓటర్ల దగ్గరికి వెళ్లి తమ తమ ఏరియాల్లో ప్రచారం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

బాల్కొండ : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాల్కొండ మండలంలోని జలాల్ పూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టుభద్రుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ రెడ్డి, సంజీవ్, రమణ, రంజిత్, రవి పాల్గొన్నారు.

పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆర్మూర్ : పట్టణంలోని 30 వార్డులోగల జెండా గల్లి, జమ్మంశెట్టి గల్లి, ఆలూరు రోడ్, సుభాష్ నగర్ ఎన్టీఆర్ కాలనీ పెద్ద బజార్‌లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించినట్టు బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ ఆదివారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పుట్యారి మెదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటరు మహాశయులను కోరారు. కార్యక్రమంలో పింజా అభినవ్, గుంజల సుమన్, సన్ని రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాలలో తాము చదివిన తరగతి గదులను సందర్శించి సంబరపడ్డారు. ఆనాటి మధుర ---్మతులను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఎక్కడ స్థిరపడ్డారు, ఏమేమి చేస్తున్నారని ఒకరినొకరు ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.

గ్రూప్ ఫోటోలు దిగి, సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించి, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాజేశ్వర్, రవీందర్ గౌడ్, రాజ గౌడ్, సుదర్శన్, అంజయ్య లను శాలువాలు, మెమెంటోళ్ళతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముసుకు దామోదర్ రెడ్డి, కుంట రమేష్ రెడ్డి, ఎస్ఐ పరశురాం, మామిడి నరేష్, ముసుకు దామోదర్, బి.స్వామి, ఎస్. సంజు మహేష్, రాజేందర్ రెడ్డి, సత్యం రెడ్డి, రాజశ్రీ, రాధా, పద్మా కళావతి, అనురాధ, రాజ్యలక్ష్మి, రజకళ, సరోజ, గోదావరి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని చేపూర్ గ్రామంలోని ఏఎస్ జి ఫంక్షన్ హాల్ లో ఆదివారం పెర్కిట్ గ్రామానికి చెందిన అల్లూరి ప్రేమంత్ రెడ్డి..గడ్కోల్ గ్రామానికి చెందిన హర్షిత రెడ్డి వివాహం జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట దంపతుల కుటుంబ సభ్యులు అల్లూరి పద్మ బసంత్ రెడ్డి, అల్లూరి నాగలింగం-సత్తెమ్మ దంపతులు, పాలెపు రాజు -జమున దంపతులు, అల్లూరి నాగిరెడ్డి-వసంత దంపతులు, బిజెపి రైతు మోర్చా నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి, వేల్పూర్ గంగారెడ్డి, విశాఖ గంగారెడ్డి, ప్రియాంక బోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహన సంఘ భవనం ప్రారంభం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 5వ డివిజన్ పరిధిలో కుమ్మర శాలివాహన సంఘ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించుకున్నారు. నార్లపురం రవీందర్ జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ రాజకీయాలలో కుమ్మర శాలివాహన కులస్తులకు తగిన గుర్తింపు లభించట్లేదని, కుమ్మర కులస్తులను గుర్తించి వారిని రాజకీయంగా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎస్ వి అంకమ్మ రావు మాట్లాడుతూ సంఘ భవన నిర్మాణానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నార్లపురం రవీందర్, గౌరవ అధ్యక్షుడు గుమ్మడిల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విజ్జ గిరి రవికుమార్ శెట్టి, కోశాధికారి రాజవరపు ఏడుకొండలు, సంఘ సభ్యులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విషపు క్రీడలు

- ఆన్‌లైన్ గేమ్స్‌లో చిక్కుకున్న యువత
- ఈజీ మనీ కోసం.. అప్పుల పాలు
- ఆత్మహత్య చేసుకునే స్థితికి చేరుతున్న వైనం
- అవగాహన లేకనే అంటున్న విశ్లేషకులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఆన్‌లైన్ గేమ్స్ తో ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి, ధనిక వర్గాలకు చెందిన యువతతో పాటు మధ్య వయస్సు కలిగిన వారు కూడా ఆన్ లైన్ ఉచ్చులో పడుతున్నారు. కష్టపడకుండా డబ్బులు సంపాధించాలనే ఆలోచనతో ఆన్‌లైన్ క్రీడల్లో పాల్గొంటున్నారు. తక్కువ డబ్బులు పెట్టి ఎక్కువ పొందాలనే ఆశతో ఆన్ లైన్ జూదం వైపు మరలతూ చివరకు అప్పులపాలై క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్న పరిస్థితి. దీంతో ఆ కుటుంబాలు కన్నీటి సముద్రంలో మునుగుతున్నాయి.

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్లు వినిపిస్తున్నారు. ఈ ఫోన్ల కారణంగానే పిల్లలు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతుంటే, యువకులు ఆపై పడినవారు పెడదారి పడుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అన్‌లైన్ లో అనేక క్రీడలకు సంబంధించిన బెట్టింగులకు పాల్పడటం, రుణాలు తీసుకోవడం, ఆఫర్ల పేరుతో మోసపోతూ దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు.

ఇందులో ప్రదానంగా ఆన్ లైన్ బెట్టింగ్, రమ్మీ లూడో, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌తో పాటు అనేక ఆన్ లైన్ గేమ్స్ ఆడి అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. కొంతమంది తెలుసుకొని వీటికి దూరమవుతుంటే చాలామంది తమ ఆస్తులను విక్రయించుకునే పరిస్థితికి దిగజారుతున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా వాహనాలు, బంగారు అభరణాలు కూడా తనకా పెట్టి జూదం ఆడుతున్నారు. మండల కేంద్రమైన తాడిచెర్లలో ఇటీవల ఓ కిరాణ వ్యాపారితోపాటు పలువురు ఆన్ లైన్ గేమ్ ఆడి లక్షల్లో రూపాయలు పోగొట్టుకొన్నట్టు తెలిసింది. ఇలా ఎంతోమంది యువత మోసపోతున్నారు.

అవగాహన లేక అవస్థలు..

ఎక్కువ శాతం యువత నిత్యం స్మార్ట్ ఫోన్‌తో గడిపేస్తున్నారు. ఈ క్రమంలో ఆన్ లైన్ గేమ్స్ బారిన పడుతున్నారు. ఫలితంగా ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. కాగా యువత అవగాహన లేకపోవడంతోనే ఆన్ లైన్ గేమ్స్ ఆడి ప్రాణాలు పైకి తెచ్చుకుంటున్నారని విశ్లేషకుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈజీ మనీ కోసం ఆశపడుతూ అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం, అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎప్పకప్పుడు అవగాహన కల్పిస్తున్నా.. మార్పు మాత్రం రావడం లేదు.

ఆన్‌లైన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి..



ఆన్‌లైన్ ఆటలపై, లోన్ ఆప్స్ వాటిలో జరుగుతున్న మోసాల పట్ల మండలం మరియు పరిసర ప్రాంత గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్ మోసాల పట్ల ఖచ్చితంగా యువత అవగాహన కలిగి ఉండాలి. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఏం చేస్తున్నారని గమనిస్తూ ఉండాలి. పిల్లల కదలికలపై ఓ కన్నేసి ఉండాలి.

ఎస్సై మహేందర్. పెద్దకొడప్‌గల్



నిరుపయోగంగా మారిన చెత్తరిక్షాలు



నవతెలంగాణ-రెంజల్

గతంలో గ్రామంలోని చెత్తాచెదారాన్ని తరలించడానికి ప్రభుత్వం మూడు చక్రాల చెత్త రిక్షాలను మంజూరు చేసింది. అయితే అవి ప్రస్తుతం తుప్పు పట్టి గ్రామపంచాయతీ ఆవరణలో పడి ఉన్నాయి. నూతన పంచాయతీ చట్టం తీసుకొచ్చాక ప్రతి జీపీలో నర్సరీ ఏర్పాటుతో పాటు చెత్త సేకరణలకు ట్రాక్టర్ ట్రాలీలను ఏర్పాటు చేసింది. దీంతో ట్రాక్టర్‌లలోనే చెత్తను సేకరిస్తుండటంతో గతంలో కొనుగోలు చేసిన చెత్త రిక్షాలు నిరుపయోగంగా మారి మూలకు పడ్డాయి. దీంతో వేలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నర్సరీల్లో, మొక్కల తరలింపు తదితర పనులకు చెత్త రిక్షాలను ఉపయోగంలోకి తీసుకుంటే ఉపయోగపడే అవకాశం ఉంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని రజక సంఘంలో సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలను ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాడ్గే సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో కుందారపు శ్రీనివాస్, రజక సంఘం సభ్యులు లోచారం వినేష్, సల్లగరిగే రమేష్, బి.రమేష్, మీర చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


సంత్ గాడ్గే బాబాకు నివాళ్లు అర్పిస్తున్న పలువురు

పచ్చదనంతో ప్రైమరీ హెల్త్ సెంటర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఈ గార్డెన్‌ని చూసి ఎవరో ఇంట్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారని అనుకుంటారు.. కాదండీ.. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గార్డెన్ ఇది. అక్కడికి చికిత్స కోసం వచ్చిన వారు హెల్త్ సెంటర్‌ను చుడాగానే సగం రోగం తగ్గిపోతుంది. అనే విధంగా ఆ గార్డెన్ అందాలు ఉన్నాయని రోగులు అంటున్నారు. ఇది ఎక్కడో కాదు.. నిజామాబాద్ నగరంలోని దుబ్బ (యుపిహెచ్సి) అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేసే ఆసుపత్రి సిబ్బంది ఏర్పాటు చేసుకున్న గార్డెన్. ఆ గార్డెన్ చూస్తుంటేనే కళ్లకు కనువిందుగా కనపడుతుందని, రోగులకు ఇంతటి పచ్చని చెట్లు చుడాగానే మనసుకు హాయిగా అనిపిస్తుందని అక్కడికి వచ్చినవారు అంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం అయ్యేనా?

- కోడ్ ముగిసిన తర్వాత నియామక నోటిఫికేషన్
- త్వరలో భర్తీకానున్న టీచర్లు, హెల్పర్ల పోస్టులు

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం పూర్వ ప్రాథమిక విద్యను అందించే దిశగా, గత కొన్ని సంవత్సరాల నుండి అస్తవ్యస్తంగా మారిన అంగన్వాడి కేంద్రాల్లో టీచర్లు, ఆయాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఇటీవల ప్రకటించారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడనుంది. ప్రీ ప్రైమరీ విద్యను అందుబాటులోకి తీసుకొస్తూ, ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని, పదవి విరమణకు అర్హత సాధించిన వారు, పదోన్నతికి అర్హత ఉన్న వారితోపాటు కేటగిరీల వారిగా ఖాళీలను లెక్కించి మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ప్రస్తుతం ఏడు ఉమ్మడి జిల్లాల పరిధిలో అమల్లో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి వచ్చేనెల తొలి వారం వరకు కొనసాగనుంది. దీంతో కోడ్ ముగిసిన తర్వాత నియామక నోటిఫికేషన్లు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడనున్నవి. గతంలో ఈ పోస్టులను భర్తీ చేసినప్పటికీ వేల సంఖ్యలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే తొలిసారి.

2023లో విడుదలైన జీవో..

అంగన్వాడి కేంద్రాల్లో టీచర్లు హెల్పర్లు 65 సంవత్సరాలు నిండితే తప్పనిసరిగా పదవి విరమణ చేయాలని, విధుల్లో కొనసాగడానికి వీలులేదని రాష్ట్ర ప్రభుత్వం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ గత సంవత్సరం ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్ల నిండిన టీచర్లు, హెల్పర్లను గుర్తించాలని జిల్లా స్థాయి అధికారులకు జూన్ 29న మెమో సైతం జారీ చేశారు. దీంతో విధులకు హాజరు కావద్దని చెప్పడంతో షాక్‌కు గురై తీవ్ర ఆందోళన చెందగా, చాలీచాలని వేతనాలతో సేవలు అందించిన ఉద్యోగ విరమణ పొందిన పలువురు టీచర్లు, హెల్పర్లు సైతం ధర్నా చేపట్టారు. 65 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ చేయాలని 2023 సెప్టెంబర్ ఐదున ప్రభుత్వం జీవో జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు లక్ష, హెల్పర్లకు 50 వేలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ జీవోలో పేర్కొంది. ఈ జీవో వెలువడిన తర్వాత ఇతర సమస్యలతో పాటు ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష బెన్ఫిట్స్ ఇవ్వాలని ఉంది. రిటర్మెంట్ బెనిఫిట్స్ అతి తక్కువగా ఉండడంతో 24 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. గత ప్రభుత్వ నాయకులు, అధికారులు బెనిఫిట్స్ పెంచుతామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. శాసనసభ ఎన్నికల షెడ్యూలు రావడంతో హామీ నెరవేరలేదు. గత పార్లమెంటు ఎన్నికల్లో సైతం అంగన్వాడి ఉద్యోగులు నిర్విరామ సేవలు అందించారు. గత సంవత్సరం జూన్ 7న ఐసిడిఎస్ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా సైతం చేశారు. అప్పటినుంచి అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేకపోవడం, అద్దె భవనాలలో కొనసాగుతుండడం అనేక చోట్ల అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాల్సిన అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహారం కరువైంది.



ఉమ్మడి జిల్లాల్లో...

నిజామాబాద్ జిల్లాలో 50 టీచర్ పోస్టులు, 290 ఆయాల పోస్టులు ఖాళీలుగా ఉండగా, కామారెడ్డి జిల్లాలో 47 టీచర్ల, 269 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు ఉండగా ఇందులో నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, భీంగల్ లలో సిడిపిఓ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1500 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. ప్రతి అంగన్వాడి కేంద్రంలో టీచర్లు, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రాజెక్టు పరిధిలో ఆరు మండలాలతో పాటు బాల్కొండ, ముప్కాల్, మెండోర, నందిపేట్, జక్రాన్‌పల్లి మండలాలు ఉన్నాయి. త్వరితగతిన టీచర్ల, ఆయాల పోస్టుల భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యూత్ డిక్లరేషన్ హామీల అమలు ఎక్కడ?

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హైదరాబాద్ భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలు ఎన్ని అమలు చేసారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నగరంలో ఓల్డ్ కలెక్టర్ మైదానం, అమరవీరుల పార్క్‌లో బిజెపి బలపరిచిన అభ్యర్థుల తరుపున ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో వీరులు ఆత్మబలిధానం చేసుకుంటే వారి త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్‌ను బొంద పెడితే అదే తోవలో పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడ మేధావులు, విద్యావంతులు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలు, హామీలలో అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేలు, యువతకు ఏడాది కాలంలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు 4వేల భృతి,

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు 15వేలు, 18సంవత్సరాలు నిండిన యువతులకు ఎలక్ట్రికల్ స్కూటీ, విద్య భరోసా ఇవన్నీ ఉత్తుత్తి హామీలేనా.. అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువత, టీచర్స్ పక్షాన పోరాడే బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులు అంజిరెడ్డికి, మల్క కొమురయ్యకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెరికోస్ వెయిన్స్ చికిత్స శిబిరం



వెరీకోస్ పరీక్ష చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి హైదరాబాద్ వారి సౌజన్యంతో స్థానిక బర్కత్పురా నందు గల రోటరీ కార్యాలయంలో రోటరీ అంతర్జాతీయ సంస్థ 120వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర ప్రజలకు ఉచిత వెరికోస్ వెయిన్స్ (రక్తనాళాల) చికిత్స శిబిరాన్ని నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్షులు బిరెల్లి విజయరావు, పద్మ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లబ్ మాజీ అధ్యక్షులు, శ్రీ అసోసియేట్స్ డైరెక్టర్ ప్రముఖ ఇంజనీర్ కటకం శ్రీనివాస్ హాజీరై ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. 120 మందికిపైగా బాధితులు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, జేమ్స్ నిజామాబాద్ కార్యదర్శులు గంగారెడ్డి, గౌరీ శంకర్ సభ్యులు హరి ప్రసాద్, గోపాల్ కిరణ్, రాజ్కుమార్ సుబేదార్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిందని రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 10:10 గంటలకు నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ అయిన సిహెచ్.సాగర్ ఇచ్చిన సమాచారం ప్రకారం అర్సపల్లి రైల్వే గేటు నుంచి 200 మీటర్ల దూరంలో ఒక గుర్తు తెలియని మహిళా(50) గుర్తు తెలియని రైలు ప్రమాదంలో మరణించిందని ఫిర్యాదు చేశారన్నారు. మృతురాలిని గుర్తించుటకూ తన వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. ఇట్టి విషయమై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్టు పేర్కొన్నారు. మృతురాలిని గుర్తించినచో 8712658591 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు

నేడు జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక

సీఎం రాక దృశ్యా బందోబస్తు ఏర్పాటుచేసిన ఇన్చార్జి సిపి

భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌ను ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించేందుకు సోమవారం జిల్లా కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు సీఎం సభను విజయవంతం చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే నిజామాబాద్ పోలీస్ శాఖ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత రెండోసారి జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం కోసం సోమవారం జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న సభకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం సభను ఎలాగైనా విజయవంతం చేసేందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులు అందరినీ కలుపుకొని ఏర్పాట్లు చేశారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రతిరోజు వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థుల తరపున వారిని గెలిపించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కోరుతున్నారు. అయితే ముఖ్యమంత్రి రాక సందర్భంగా మరోవైపు ఇంచార్జ్ సిపి సింధు శర్మ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి నుంచి ఫంక్షన్ హాల్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని తనిఖీలు నిర్వహించారు. బయట వారు ఎవరూ కూడా లోనికి రాకుండా పాసులు మంజూరు చేసిన వారికి మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని రావుజీ సంఘంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1999-2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక్కచోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే సంఘం అధ్యక్షుడు గంగోనె గంగాధర్, ఉపాధ్యాయులు రవికుమార్, అనిల్ కుమార్, సత్యంను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణ సాయి, అరవింద్, కన్నా, రవి, నర్సాగౌడ్ పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేస్తాం

- ఏఐపిఎస్యు జాతీయ కార్యదర్శి షఫీవుల్లా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యారంగా సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేస్తామని ఏఐపిఎస్యు జాతీయ కార్యదర్శి షఫీవుల్లా అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో పత్రిక సమావేశంలో ఏఐపిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలిండియా కార్యదర్శి షఫీఉల్లా మాట్లాడుతూ.. ఏఐపిఎస్‌యు గత 7 దశాబ్దాల నుంచి నిరంతరం విద్య రంగా సమస్యల పరిష్కారానికై అలుపెరుగని పోరాటాలు చేస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్‌యు) రాష్ట్ర మహాసభలు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో 22, 23 నిర్వహించారు. ఈ రెండు రోజుల పాటు జరిగిన ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించు కోవడం జరుగుతుందని తెలిపారు. అందుకోసం ఒక నూతన కమిటీ 13 మందిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా బోడ అనిల్, మన్నెకుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బేగరి సాయికుమార్, ఉపాధ్యక్షులుగా రాజు, కోశాధికారిగా ఆనంద్, అదేవిధంగా 8 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఆర్ఎస్పి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కౌడగాని శివాజీ, ఆర్ఎస్పీ పార్టీ జిల్లా కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబా, యుటియుసి రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్, మహిళా రాష్ట్ర కన్వీనర్ విజయలక్ష్మి, ఏఐపిఎస్యు రాష్ట్ర నాయకులు, గోపాల్ సింగ్, పరమేశ్వర్ రాజారాం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షఫీవుల్లా

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రంలో అనుమతులు లేకుండా అక్రమంగా మొరంను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రం నుండి మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ వెళ్లే దారిలో వరద కాలువ కట్ట నుండి అక్రమంగా మొరం దందా కొనసాగుతుందని అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. అదే సమయంలో రెండు ట్రాక్టర్లలో అక్రమంగా మొరంను తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుకున్న రెండు మొరం ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమంగా మొరం తరలింపుకు సంబంధించి బండారు ప్రభాకర్ అనే వ్యక్తితో పాటు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మొరం, ఇసుక తరలిస్తే పట్టుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆరోపణలు చేస్తే.. చూస్తూ ఊరుకోం

- ఇసుకపై బహిరంగ చర్చకు సిద్ధం
- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల

మా పార్టీ, మా నాయకుడి మీద అనవసరమైన ఆరోపణలు చేస్తే చూస్తూ.. ఊరుకోబోమని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం అన్నారు. ఆదివారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఫేస్‌బుక్ వేదికగా తమ పార్టీపై, నాయకుడిపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో 6 వేలకు ఒక ట్రాక్టర్ ఇసుకను ప్రజలకు అమ్ముకుని సొమ్ముచేసుకున్నట్టు పదే పదే ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇసుక విషయంలో తమ ప్రభుత్వ పాలన సమయంలో అవినీతి జరిగిందో, లేక ఇప్పుడు అవినీతి జరుగుతుందో తెలంగాణ తల్లి విగ్రహం సాక్షిగా బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో అక్రమంగా ఇసుకను తీస్తూ పైగా మాపై ఆరోపణలు చేస్తారా అంటూ మండిపడ్డారు. మీరు ప్రజలకు అభివృద్ధి పనులు చేస్తే సహకరిస్తాం కానీ, అనవసరంగా మమ్మల్ని మాటలు అంటే చూస్తూ.. ఊరుకోబోమని హెచ్చరించారు. ఇందులో భాగంగా మాజీ ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కని మధుసూదన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, క్యాతం సుభాష్, దేవుడు నర్సయ్య, కూశ లింబాద్రి, జైనోద్దీన్, లక్ష్మం నర్సయ్య పొలింగ్, రొక్కెడ మోహన్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న నాయకులు

గ్రంథాలయం తనిఖీ



నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. పాఠకులకు కావలసిన పోటీ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా లేవాని అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా పాఠకుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

సేవ చేసే వారిని ఎన్నుకోవాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కామన్ మెన్ తో బిజినెస్మెన్లు పోటీలో ఉన్నారని, స్వతంత్ర అభ్యర్థిగా పట్టభద్రులు ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న తనను ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు కోరారు. నిజామాబాద్ ట్రస్మా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా ట్రస్మా సంఘంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల అన్ని రకాల సమస్యలను పరిష్కరించామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి పార్టీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కోట్ల రూపాయలను ఖర్చులు చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారికి ఫిర్యాదు సైతం చేస్తామని తెలిపారు. బిజినెస్మెన్లుగా ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా బిజినెస్మేన్ గానే వ్యవహరిస్తారని సర్వీస్మెన్‌గా పనికిరారని అన్నారు. పట్టభద్రులు గమనించి సేవ చేసే వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయ సింహ గౌడ్, జిల్లా అధ్యక్షులు నిత్యానందం, ప్రధాన కార్యదర్శి అరుణ్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరసింహారావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, నారా గౌడ్, పాఠశాల శ్రీనివాస్, నగేష్, పృథ్వి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

చిన్నారి వైద్యానికి కల్వకుంట్ల కవిత ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శ్రీకాంత్ విజయ దంపతుల మూడు నెలల బాబు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. దంపతులు నిరుపేదలు కావడంతో బాబుకు వైద్యం చేయించలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం తెలిసిన వారి సహకారంతో నిజామాబాద్ ప్రగతి హాస్పిటల్‌కు బాబును తీసుకెళ్లి వైద్యులకు చూపించగా బాబుకు సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. దాంతో ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కృష్ణ ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఫోన్‌లో చెప్పడంతో ఆమె స్పందించి బాబు సర్జరీ 25 వేల రూపాయల ఆర్థికసహాయం అందించారు. దంపతులు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు